సాక్షి
నిర్మల్
బుధవారం । 19 । జూన్ । 2024



పుస్తకనేస్తం.. విజ్ఞాన సర్వస్వం

ఒకప్పుడు పుస్తకం హస్తభూషణం.. ప్రస్తుతం ఆ స్థానాన్ని సెల్‌ఫోన్ ఆక్రమించేసిందని చెప్పొచ్చు. నేడు జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

8లో▸



..అవగాహన తప్పనిసరి

వీధి వ్యాపారులకు చట్టంపై అవగాహన కల్పించాలని ప్రవాసీమిత్ర లేబర్ యూనియ న్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పర్కిపండ్ల పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సర్వే చేపట్టారు.

9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

గుట్కా మాఫియా!

- జిల్లాలో జోరుగా అక్రమ వ్యాపారం
- మహారాష్ట్ర నుంచి జిల్లాకు దిగుమతి
- గోదాముల్లోనే యథేచ్ఛగా డంపింగ్
- ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు
- అధికారుల పట్టింపు నామమాత్రమే..



తానూరు: ఎల్వీలో పోలీసులు పట్టుకున్న గుట్కా ప్యాకెట్లు (ఫైల్)

నిర్మల్‌టౌన్/తానూరు: జిల్లాలో నిషేధిత గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. దుకాణాల్లో బహిరంగంగా విక్రయిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మూడు సంచులు, ఆరు ప్యాకెట్లుగా వ్యాపారం జరుగుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి నిత్యం జిల్లాకు సరుకు వస్తోంది. మహారాష్ట్రకు జిల్లా సరిహద్దుగా ఉండడంతో సులువుగా తీసుకువస్తున్నారు. కొందరు అక్రమార్కులు మాఫియాగా ఏర్పడి ఈ దందా సాగిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో నిషేధిత గుట్కా ప్యాకెట్లు యథేచ్ఛగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

గోదాంలలో నిల్వ చేసి..

అక్రమార్కులు భారీ స్థాయిలో గుట్కా ప్యాకెట్ల లోడ్‌లను తీసుకువచ్చి జిల్లా కేంద్రం, శివారు ప్రాంతాలు, ఆయా మండలాల్లో గోదాంలలో నిల్వ చేస్తున్నారు. వీటిని ప్రతిరోజూ ఉదయం దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌పై ఉన్న ధర కంటే రెండు రెట్లు అధికంగా విక్రయిస్తూ అనతి కాలంలోనే రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. అధికారులు అడపాదడప దాడులు చేస్తుండగా అక్రమార్కులు కొద్దిరోజుల పాటు గుట్కాను గోదాంలలోనే బ్లాక్ చేస్తున్నారు. అనంతరం యథావిధిగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రూ.80కు లభించే ఓ కంపెనీ గుట్కా ప్యాకెట్‌పై నిషేధం ఉండగా ఆయా మండలాలకు చెందిన వ్యాపారులు రూ.200 వరకు విక్రయిస్తున్నారు. గుట్కా తింటే క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధులతో అనేకమంది చనిపోతున్నా అమ్మకాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారు.

రవాణా సాగేదిలా..

మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని తానూరు, కుభీర్, ముధోల్, బాసర, భైంసా, సారంగాపూర్ మండలాలకు అక్కడి వ్యాపారులు రోడ్డు మార్గం ద్వారా ద్విచక్రవాహనాలపై తెస్తున్నారు. మహారాష్ట్ర నుంచి వాహనం బయలుదేరిన వెంటనే వాట్సాప్ మెసేజ్ ద్వారా స్థానిక వ్యాపారులకు సమాచారం ఇస్తారు. ఏ గుట్కా.. ఎన్ని బస్తాలు.. ఎక్కడ దించాలో.. అప్పుడే సమాచారం ఇస్తారు. ప్రణాళిక ప్రకారమే వాహనం నిర్దేశిత ప్రాంతానికి చేరుకుంటుంది. ఆ తర్వాత వ్యాపారులు ద్విచక్ర వాహనాలపై వెళ్లి సరుకు తెచ్చుకుంటున్నట్లు సమాచారం. ఆ తర్వాత రోజు గ్రామాలవారీగా ద్విచక్ర వాహనాలతో పాటు, ట్రాలీ ఆటోల ద్వారా చిరువ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. రకరకాల పేర్లతో వీటి వ్యాపారం కొనసాగుతోంది. గతేడాది అక్టోబర్ 19న నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న గుట్కా కంటైనర్‌ను నిర్మల్ సమీపంలోని నిలాయిపేట్ గ్రామ పరిధిలో వాణిజ్య పనుల శాఖ అధికారులు పక్కా సమాచారం మేరకు పట్టుకున్నారు. 150 బస్తాల గుట్కాను స్వాధీనపరచుకున్నారు.

గుట్కా పట్టివేత ఘటనల్లో కొన్ని..

- తానూరు మండలంలోని ఓ కిరాణాషాపులో గతేడాది పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.27వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టుకుని కేసు నమోదు చేశారు.
- గతేడాది ముధోల్ మండల కేంద్రంలో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు కిరాణాషాపుల్లో దాడులు నిర్వహించి రూ.లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.
- గతేడాది నిజామాబాద్ నుంచి ధర్మాబాద్‌కు తరలిస్తున్న రూ.లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లను బిద్రెల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు.
- గతంలో ఆదిలాబాద్ నుంచి సారంగాపూర్ మీదుగా మహారాష్ట్రకు బొలెరో వాహనంలో తరలిస్తున్న రూ.10 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను ముందస్తు సమాచారంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- గతంలో తానూరు మండలం ఎల్వీత్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి ధర్మాబాద్ నుంచి గుట్కా తీసుకువచ్చి గ్రామాల్లో అమ్ముతుండగా తానూరు పోలీసులు సింగన్‌గాం వద్ద పట్టుకుని కేసు నమోదు చేశారు.

నామమాత్రపు దాడులే..

గుట్కా నిషేధాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినా అధికారులు మాత్రం కిరాణాషాపులు, పాన్‌షాపుల్లో అడపాదడప దాడులు నిర్వహిస్తూ అసలు సూత్రదారులను వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించి ఒకటి రెండు కేసులు నమోదు చేస్తున్నా పూర్తిస్థాయిలో గుట్కాను నియంత్రించడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం



నిషేధిత గుట్కా ప్యాకెట్లను అమ్మితే కఠినచర్యలు తీసుకుంటాం. గుట్కాలు తింటున్న చాలామందికి క్యాన్సర్ వస్తోంది. గుట్కా విక్రయాలపై సమాచారం అందగానే దాడులు చేసి కేసులు నమోదు చేస్తాం. గుట్కా దందా చేసే అక్రమార్కులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం.

– గంగారెడ్డి, నిర్మల్ డీఎస్పీ

న్యూస్‌రీల్

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అడివయ్య

నిర్మల్‌చైన్‌గేట్: నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నిరసనగా ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం రెండు చోట్ల అక్రమాలు గుర్తించామని చెప్పాయి గాని కుంభకోణంపై విచారణ జరిపిస్తామని గాని అభ్యర్థులకు ఏం న్యాయం చేయనుందో తెలుపలేదని చెప్పారు. బీజేపీ ఏలుబడిలోని గుజరాత్‌లో అవకతవకలు జరిగాయని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఒక్కసారిగా అక్రమాల పుట్ట పగిలినట్లయిందని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో నీట్ సరైంది కాదని, పలు రాష్ట్రాలు అభ్యంతరం పెట్టాయని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, శంబు, జిల్లా కమిటీ సభ్యులున్నారు.

ఆహ్వానపత్రిక అందజేత



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక ఇస్తున్న సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 20న జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం కార్యక్రమానికి హాజరు కావాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి ఆయన క్యాంపు కార్యాలయంలో ఛత్రపతి శివాజీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు మెడిసెమ్మె రాజు, సభ్యులు మంగళవారం ఆహ్వానపత్రిక అందజేశారు. కమిటీ సభ్యులు దత్తు, శంకర్, కృష్ణంరాజు, శాంతిలాల్ పటేల్, అలివేలు, అశోక్, విలాస్, రాజేశ్వర్, రాఘవులు, రాంనాథ్‌గౌడ్, కిషన్, మూర్తి, ప్రభు, సంతోష్, భూపతిరెడ్డి, వెంకటపతి తదితరులున్నారు.

నిర్మల్ డిపోకు 11 అవార్డులు



అవార్డులు అందుకున్న నిర్మల్ డిపో సిబ్బంది

నిర్మల్ టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపో పరిధిలో విధులు నిర్వహించే 11మంది డ్రైవర్లు, కండక్టర్లు ప్రగతిచక్ర అవార్డులు అందుకున్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని రీజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ సోలోమాన్ అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డ్రైవర్లు, కండక్టర్లు ఎనలేని కృషి చేసి డిపోను ప్రగతి పథంలో నడుపుతున్నారని పేర్కొన్నారు. నిర్మల్ డిపోను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచాలని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ప్రణీత్, ప్రవీణ్, నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, ఆదిలాబాద్ మేనేజర్ కల్పన, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్యమిషన్‌లో భాగంగా పీఎం జన్‌మాన్ పథకం కింద ఒప్పంద ప్రాతిపదికన మొబైల్ మెడికల్ యూనిట్‌లో ఒక వైద్యాధికారి, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక పారామెడికో కం అసిస్టెంట్ పోస్టుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. nirmal.telangana.gov.in నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని అర్హత పత్రాలు జతచేసి డీఎంహెచ్‌వో కార్యాలయంలోని రూమ్ నంబర్ ఎఫ్ 25 లేదా ఐడీవోసీ ఎల్లపల్లిలో ఈ నెల 24తేదీ లోపు అందించాలని సూచించారు.

రేపు ప్రేరణ తరగతులు

నిర్మల్ రూరల్: ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులందరికీ గురువారం ప్రేరణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యార్థులకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఉపాధ్యాయులకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సినీ, టీవీ నటుడు, మోటివేటర్ ప్రదీప్ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాలల్లో సమస్యలుంటే తెలుపాలి



విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలతో పాటు నిర్మల్ అర్బన్, నిర్మల్ రూరల్, కేజీబీవీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లు, హాజరు బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మహేశ్వర్‌రెడ్డి వారికి అందుతున్న వసతుల గురించి తెలుసుకున్నారు. వారికి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు అభినందనీయం

నిర్మల్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని ఎస్పీ జానకీ షర్మిల ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల పనితీరుపై జిల్లా పోలీస్ సిబ్బందికి ఎన్నికల కమిషన్ నుంచి మంగళవారం ప్రశంసాపత్రం అందినట్లు పేర్కొన్నారు. సిబ్బంది కృషితోనే ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది పనితీరును ఎస్పీ ప్రశంసించారు.

ముంపుపై పట్టింపేది?



నిండామునిగిన జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్ (ఫైల్)

- కందకాలు, డ్రైనేజీల ఆక్రమణ
- రెడ్‌జోన్, ఎఫ్టీఎల్‌లో కట్టడాలు
- బఫర్ ఏరియాల్లో వెంచర్లు
- చర్యలు చేపట్టని బల్దియాలు

నిర్మల్: రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. చెరువులు, కందకాలు, కాలువలు చివరకు డ్రైనేజీలు.. ఇలా దేన్నీ వదలకుండా ఆక్రమిస్తూ పోతుండటంతో వానాకాలం వరదనీరు వెళ్లేందుకు దారిలేక ఊళ్లను ముంచేస్తోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డ్రైనేజీల్లోనూ పూడిక తీయకపోవడం, రోడ్లపై పడ్డ వర్షపు నీరు వాటిలోకి వెళ్లే మార్గాలు లేక ఏటా ముంపు తప్పడం లేదు. ఎక్కడో వీధి చివరనున్న కందకాన్ని, కాలువను ఎవరో ఒకరు ఆక్రమించడంతో వానాకాలం ఆ వీధంతా జలమయమవుతోంది. వీటిపై స్థానిక అధికారులకు సంపూర్ణ అవగాహన ఉన్నప్పటికీ.. వారిని రాజకీయ ఒత్తిళ్లు, లంచాల వ్యవహారాలు అడ్డుపడుతున్నాయన్నది బహిరంగ రహస్యం. దాదాపు మూడేళ్లుగా జిల్లా ముంపు బారిన పడుతున్నా.. ఇప్పటికీ పాలకులు, అధికారులు శాశ్వత పరిష్కారాలను మాత్రం చూపకపోవడం దారుణమని బాధితులు వాపోతున్నారు.

నిర్మించి వదిలేశారంతే..

ప్రతీ వానాకాలం జిల్లాకేంద్రం మునగడానికి ఎన్నో కారణాలున్నాయి. ప్రధానంగా శివాజీ చౌక్ నుంచి మంచిర్యాల రోడ్డు మొత్తం నీటమునుగుతోంది. ఇందుకు ఆ రోడ్డుపై పడ్డ వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడమే కారణం. నాలుగేళ్ల క్రితం ఈ జాతీయ రహదారికి ఇరువైపులా భారీ డ్రైనేజీలను నిర్మించినా.. ఇప్పటివరకు వాటిని కనీసం శుభ్రం చేసిన దాఖలాలు లేవు. చాలాచోట్ల అవన్నీ పూడుకుపోయాయి. ఆక్రమణలకు గురయ్యాయి. ఈ రహదారి వెంట ఉన్న వాణిజ్య సముదాయాలకు చెందిన వ్యాపారులు వేసిన చెత్త, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర వ్యర్థాలతో నిండిపోయాయి. సదరు డ్రైన్ల కనెక్టివిటీ కూడా పూర్తి నిర్మాణం కాలేదు. కనీసం వానాకాలం సీజన్‌లోనూ పూడిక తీయకపోవడంతో వరదనీరు రోడ్డంతా పారి జలసంద్రమవుతోంది.



పూడికతో నిండిన మంచిర్యాలరోడ్డు డ్రైనేజీ

రెడ్‌జోన్లు, ఎఫ్టీఎల్‌లలో..

నిర్మల్‌తో పాటు భైంసాలోనూ ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాకేంద్రంలో చెరువులు, కందకాలను ఆక్రమిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలనూ తుంగలో తొక్కుతూ చెరువుల ఎఫ్టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్)లో నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో కోర్టు ఆదేశాల మేరకు పలు చెరువుల్లో వివిధ కుల సంఘాల భవనాలనూ కూల్చేసిన ఘటనలున్నాయి. అయినప్పటికీ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. భైంసా పట్టణంలో గడ్డెన్నవాగు దిగువన సుద్దవాగు పరీవాహక ప్రాంతంలోని రెడ్‌జోన్‌లోనూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇవన్నీ వానాకాలంలో నీట మునుగుతున్నాయి. బఫర్, ఎఫ్టీఎల్, రెడ్‌జోన్‌లలో ఆక్రమణలు, నిర్మాణాలపై అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడంతోనే ప్రతీ వానాకాలం సీజన్‌లో ఆయా ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి.

చర్యలు నామమాత్రమే..

జిల్లాలో తరచూ ముంపు బారిన పడుతున్న ప్రాంతాల్లో తీసుకుంటున్న ముందస్తు చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. ఈసారి సీజన్ ప్రారంభమైనా.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో బల్దియాలకు ముంపుపై ముందస్తు పట్టింపు ఉన్న దాఖలాలు కనిపించడం లేదు. మూడేళ్లుగా కురుస్తున్నట్లు ఈసారీ భారీ వర్షాలు పడితే.. వరద భయం మళ్లీ వెంటాడే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంటనే తగినచర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రెండేళ్లక్రితం నీటమునిగిన జీఎన్ఆర్ కాలనీ

గుణపాఠం నేర్వలే..

రెండేళ్లక్రితం జిల్లాకేంద్రంలోని జీఎన్ఆర్ కాలనీ జలప్రళయంలో చిక్కుకుంది. ఎగువనున్న స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో స్వర్ణ నది ఉప్పొంగింది. నది ఒడ్డునే బఫర్‌జోన్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన ఈ వెంచర్ (కాలనీ)లోకి ఒక్కసారిగా వరద పోటెత్తింది. వేకువజామున కాలనీవాసులు మేల్కొనడంతో భారీ ప్రమాదం తప్పినట్లయింది. వారంతా ఇళ్లపైకి చేరుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. వారందరినీ ఒడ్డుకు చేర్చడానికి ఎంతోమంది శ్రమించాల్సి వచ్చింది. చివరకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలూ రంగంలోకి దిగాయి. కానీ.. పదుల సంఖ్యలో పశువులు కొట్టుకుపోయాయి. భారీగా ఆస్తినష్టం జరిగింది. ఇంతటి ఘటన జరిగినా.. ఇప్పటికీ సాక్షాత్తు జిల్లాకేంద్రంలోని బఫర్‌జోన్లలో వెంచర్లు, నిర్మాణాలు ఆగకపోవడం, పాలకులు, అధికారులూ వాటిని ఆపకపోవడం గమనార్హం.

నిలిచిన బదిలీల ప్రక్రియ



కోర్టు కేసు విషయం డీఈవోతో చర్చిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

- డివిజన్ బెంచ్ నుంచి సింగిల్ బెంచ్‌కు మారిన టెట్ కేసు
- పీఈటీ, పండితుల ప్రమోషన్లు యథాతథం

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ పడింది. టెట్ పాసైన ఎస్జీటీలకే ప్రమోషన్లు ఇవ్వాలని ఆదిలాబాద్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడు హైకోర్టులో కేసు వేశాడు. మంగళవారం ఈ కేసు డివిజన్ బెంచ్ నుంచి సింగిల్ బెంచ్‌కు మారింది. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు జడ్జి ఈనెల 20న సింగిల్ బెంచ్ సమక్షంలో మరోసారి వాదనలు విని తీర్పు ఇవ్వనున్నారు. ఈ తీర్పు ప్రకారమే ప్రమోషన్ల ప్రక్రియ ముందుకు సాగనుంది. దీంతో వారం నుంచి జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియకు కాస్త బ్రేక్ పడింది. అయితే పండిత, పీఈటీలకు టెట్ వర్తించకపోవడంతో వారి ప్రమోషన్ల విషయమై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది.

నేడో, రేపో ఉత్తర్వులు..

పండిత, పీఈటీల ప్రమోషన్లకు సంబంధించి నేడో, రేపో ఉత్తర్వులు రానున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారమే వీటికి సంబంధించిన ఉత్తర్వులు రావాల్సి ఉండగా గంట గంటకు ఉత్కంఠ నెలకొంది. మంగళవారం వేకువజామున ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన ప్రమోషన్ ఉత్తర్వులు రావడంతో.. నిర్మల్ జిల్లా ఉత్తర్వులు కూడా వస్తాయని ఉపాధ్యాయులు భావించారు. కానీ.. టెట్ విషయంలో ఉదయం హైకోర్టు తీర్పు ఇవ్వడంతో అధికారులు ప్రక్రియను తాత్కాలికంగా ఆపేశారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రమోషన్ల వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసింది. ఉపాధ్యాయులు ఆప్షన్స్ ఇచ్చుకున్న సందర్భంలో పాఠశాల వేకెన్సీల్లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా వెరిఫికేషన్ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది. ఈనెల 20వ తేదీన టెట్‌కు సంబంధించిన కేసు కోసం పాఠశాల విద్యాశాఖ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసే అవకాశం ఉంది. దీంతో పండిత, పీఈటీల ఆర్డర్లు కూడా ఆలస్యంగా విడుదలయ్యే అవకాశముంది.

ప్రక్రియ ఆగిపోలేదు

ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ ఆగిపోలేదు. ఏ క్షణమైనా ఉన్నతాధికారుల నుంచి ఆర్డర్లు రిలీజ్ చేయమని ఆదేశాలు రావచ్చు. ఇప్పటికే ఈ విషయమై వివిధ దశల్లో ప్రక్రియ పూర్తి చేశాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో



ప్రశంసాపత్రాలతో సౌమ్య, చిన్నారులు

చిన్నారుల నాట్య ప్రతిభ

భైంసాటౌన్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భైంసాకు చెందిన శ్రీ నయనం నృత్య కళానిలయం చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చి ఆహూతులను ఆకట్టుకున్నారు. శిక్షకురాలు రంగు సౌమ్య ఆధ్వర్యంలో 15మంది చిన్నారులు పాల్గొనగా, వీరికి నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు.

నాలుగు కిలోమీటర్లు నడిస్తేనే బడి



మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన 20మంది విద్యార్థులు లక్ష్మణచాంద మండలం వద్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. పరిమండల్ నుంచి వద్యాల్‌కు నేరుగా బస్సు సౌకర్యం లేదు. దీంతో పరిమండల్ నుంచి కాలినడకన రోజూ వద్యాల్‌కు వచ్చి వీరు చదువుకుంటున్నారు. రానూపోనూ.. నిత్యం ఎనిమిది కిలోమీటర్లు నడుస్తున్నట్లు వారు తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. - లక్ష్మణచాంద

క్లుప్తంగా

రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స



మహిళ కడుపులో నుంచి బయటకుతీసిన కణితి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకాపూర్‌కు చెందిన రంజన అనే మహిళ రెండు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతుంది. జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులతో పాటు ఇతర జిల్లాల్లో సైతం వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. ఈ క్రమంలో రిమ్స్‌లో చేరగా వైద్యులు మంగళవారం శస్త్ర చికిత్స చేశారు. మహిళ కడుపులో నుంచి 6 కిలోల కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుటగా ఉందని వైద్యులు తెలి పారు. శస్త్రచికిత్స చేసిన వారిలో వైద్యులు శిరీష్, శ్రీకాంత్, గణేష్, శిరిన్, సతీష్, వెంకటేశ్, శరణ్య,శరత్ ఉన్నారు. కాగా వైద్యులను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అభినందించారు.

ఆంగ్ల బోధనపై దృష్టి సారించాలి

ఇచ్చోడ: ఆశ్రమ పాఠశాలల్లో ఆంగ్ల బోధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఆంగ్లం సబ్జెక్టు ఉపాధ్యాయులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ఐటీడీవో పీవో, డీడీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ఆంగ్లం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నిందితుడు రాజ్‌మోరేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. 16ఏళ్ల బాలికకు మామ వరుస అయిన బంధువు కొద్ది రోజులుగా మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నప్పటికీ బాలికను పెళ్లి చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరిపి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన పడాల భోజన్నకు చెందిన గేదె మంగళవారం మధ్యాహ్నం మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి తగిలి షాక్‌తో మృతి చెందింది. ఏఈ వెంకటపతి, లైన్‌మన్ అఖిల్, సిబ్బంది రమణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెటర్నరీ డాక్టర్ ప్రియాంకకు సమాచారం ఇవ్వగా ఆమె సిబ్బందితో పోస్టుమార్టం, పంచనామా చేయించారు. గేదె విలువ రూ.75వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

వ్యాపారులు లైసెన్స్ తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్: ఆహార వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అధికారి వాసురామ్ తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలో ఆయన పలు స్వీట్ హౌస్‌లు, హోటళ్లు, కిరాణా షాపుల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రంగు కలిపిన ఆహార పదార్థాలను చెత్తబుట్టలో పడేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆహార వ్యాపార లైసెన్స్ లేని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దుకాణాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వాడిన వంటనూనెలు పదేపదే వాడవద్దని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే భారీ జరిమానాలు చెల్లించక తప్పవని హెచ్చరించారు.

పుస్తకనేస్తం.. విజ్ఞాన సర్వస్వం

- పఠనం ద్వారానే విజ్ఞాన సముపార్జన
- చిన్నప్పటినుంచే అభిరుచి ఉండాలి
- నేడు జాతీయ పఠన దినోత్సవం



నిర్మల్ జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో పాఠకులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఒకప్పుడు పుస్తకం హస్తభూషణం.. కానీ.. నేడు ఆ స్థానాన్ని సెల్‌ఫోన్ ఆక్రమించింది. గతంలో విజ్ఞాన సముపార్జనకు పుస్తకాలే తొలి సోపానాలుగా ఉండేవి. ప్రస్తుతం అన్నింటికీ సెల్‌ఫోనే ఆధారమైంది. ఈ ఆధునిక సమాజంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ టీవీ, మొబైల్ ఫోన్, ఇంటర్నెట్‌కు బానిసలయ్యారు. దీంతో పుస్తక పఠనాన్ని మరిచేపోతున్నారు. 'చిరిగిన చొక్కా నైనా తొడుక్కో గాని.. ఓ మంచి పుస్తకం కొనుక్కో' అని పెద్దలు చెప్పిన మాట నేడు అంతరించిపోతోంది. పీలికలుగా ఉన్న 'మోడరన్ దుస్తులైనా వేసుకో.. చేతిలో ఓ మంచి ఆండ్రాయిడ్ ఫోన్ ఉంచుకో' అన్నట్లుగా తయారైంది నేటి యువతరం. గతంలో పుస్తకాల అధ్యయనం ఒక తపన, ఒక తీరని విజ్ఞాన దాహం.. పుస్తకాన్ని తమ జీవితాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే ఒక విజ్ఞానజ్యోతిగా భావించేవారు. ప్రస్తుతం పుస్తక పఠనానికి ప్రాధాన్యత తగ్గుతున్నా ఇప్పటికీ పుస్తకాలను నేస్తాలుగా భావించేవారూ ఉన్నారు. మనదేశంలో ఏటా జూన్ 19న జాతీయ పఠన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం..

ఇదీ నేపథ్యం..

పుస్తకాలు ప్రపంచానికి కిటికీ అని తరచుగా చెబుతారు. చదవడం అనేది ఒకరి జ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుస్తుంది. సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది. జూన్ 19న కేరళలో 'గ్రంథాలయ ఉద్యమ పితామహుడు'గా ప్రసిద్ధి చెందిన పీఎన్ పనికర్ వర్ధంతి. అతను 1990లో రాష్ట్రంలో సార్వత్రిక అక్షరాస్యతను సాధించి కేరళలో ఒక ప్రసిద్ధ సాంస్కృతిక ఉద్యమాన్ని ప్రేరేపించి, వివిధ కార్యకలాపాలను ప్రోత్సహించారు. 2004 జూన్ 21న భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ అతడి జ్ఞాపకార్థం స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేసి గౌరవించింది. 2017లో ప్రధాని నరేంద్రమోదీ 'నేషనల్ రీడింగ్ మంత్'ను ప్రారంభించారు. ఈ పఠన మాసం జాతీయ పఠన దినోత్సవంతో ప్రారంభమవుతుంది.

పఠన ప్రయోజనాలెన్నో..

సంస్కృతులు, తరాలకు వారధిగా ఉండే అనుభవంగా పఠనాన్ని గుర్తిస్తారు. ఇది సాహిత్యంలోనైన శక్తిని మనకు గుర్తు చేస్తుంది. పుస్తకాల ద్వారా, మనం విభిన్న దృక్కోణాలను అన్వేషించవచ్చు. విభిన్న పాత్రలతో సహానుభూతిని పొందవచ్చు.

- ఒంటరితనం పారదోలి మంచి స్నేహితులుగా పుస్తకాలు వ్యవహరిస్తాయి. నైరాశ్యం దరిచేరదు.
- ఏకాగ్రత పెరుగుతుంది. శ్రద్ధగా చదవడం అలవాటవుతుంది.
- 'పద సంపద' వృద్ధిచెంది భాషపై పట్టు పెరుగుతుంది. చక్కటి భావవ్యక్తీకరణకు దోహదం చేస్తుంది.
- మెదడు పనితీరు మెరుగుపడుతుంది.
- ప్రాపంచిక విషయాలు తెలుస్తాయి. వాటిద్వారా మన లోకజ్ఞానం రెట్టింపవుతుంది.
- మానసికంగా దృఢంగా అయ్యేందుకు దోహదపడుతుంది.
- సృజనాత్మకత పెంపొందించడానికి పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానం తోడ్పడుతుంది.
- విజేతల ఆత్మకథలు చదివినప్పుడు స్ఫూర్తి, ప్రేరణ పొందవచ్చు.
- పరాజితుల అనుభవాలు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపిస్తాయి. ఒత్తిడిని తగ్గించడానికి పుస్తక పఠనం దివ్యౌషధంగా పనిచేస్తుంది.

పిల్లల్లో పఠనాసక్తి పెంచండిలా..

- రోజువారీపనుల్లో తీరికలేకుండా ఉన్నా కనీసం 10నిమిషాలు పుస్తక పఠనానికి కేటాయించాలి.
- తొలుత నచ్చిన పుస్తకం, తక్కువ పేజీలున్నవి ఎంపిక చేసుకుంటే ఆసక్తి పెరుగుతుంది.
- ఎక్కువ పేజీలున్నవైతే రోజుకు పది పేజీల చొప్పున పూర్తిచేస్తే ఏడాదిలో 200 పేజీలున్న 18 పుస్తకాలు చదవొచ్చు.
- రోజువారీ పనుల్లో విరామం దొరికినప్పుడు కాలక్షేపం కోసం పఠించాలి.
- చిన్నారులతో చందమామ కథలు, బాలవికాస పుస్తకాల్ని చదివించాలి.

అందుబాటులో అన్ని పుస్తకాలు


నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండల కేంద్రాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం శాఖ గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ప్రధాన గ్రంథాలయంతోపాటు 16 మండల కేంద్రాల్లో శాఖ గ్రంథాలయాలున్నాయి. వీటిలో దిన, వార, మాసపత్రికలతో పాటు కథల పుస్తకాలు, నవలలు, విజ్ఞాన సంబంధిత పుస్తకాలున్నాయి. వీటిని సభ్యత్వం తీసుకోవడం ద్వారా చదువుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా సభ్యత్వం నమోదు చేసుకున్న పాఠకులు దాదాపు 18వేలకు పైగా ఉన్నట్లు గ్రంథాలయశాఖ అధికారులు చెబుతున్నారు. నిర్మల్ పట్టణంలో కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠకుల కోసం అన్నిరకాల పుస్తకాలతో ఉచిత గ్రంథాలయ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు.

ఇంటినే గ్రంథాలయంగా..



ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాకు చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదివే అభిరుచి ఉంది. మిత్రులు, సాహితీవేత్తలు కానుకగా ఇచ్చిన పుస్తకాలతో ఇంట్లో చిన్నపాటి గ్రంథాలయం ఏర్పాటైంది. సమయం దొరికినప్పుడల్లా చదువుతూ కాలక్షేపం చేస్తా. పిల్లలకు చిన్నప్పటినుంచే పుస్తకపఠనాన్ని అలవాటు చేయాలి.
– అంబటి నారాయణ, సాహితీవేత్త, నిర్మల్

కాస్త సమయం దొరికినా..



ఢిల్లీలోని కెనడా రాయబార కార్యాలయంలో సీనియర్ సలహాదారుగా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. నాలుగు దశాబ్దాలుగా పుస్తకాలనే నేస్తాలుగా భావిస్తూ జీవనం సాగిస్తున్నాను. పుస్తక పఠనం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. నేటి యువతరం చిన్నప్పటి నుంచే పుస్తక పఠనాన్ని అభిరుచిగా మలుచుకోవాలి.
– డాక్టర్ సంపత్‌కుమార్, రచయిత, నిర్మల్

లక్ష్యానికి చేరువచేసేది పుస్తకమే..



పిల్లలకు చిన్నప్పటి నుంచే పుస్తకపఠనాన్ని అలవాటు చేయాలి. పెద్దయ్యాక ఈ అభిరుచి లక్ష్యాలకు చేరువచేస్తుంది. పుస్తక పఠనంతో విజ్ఞానంతో పాటు మానసిక స్థిరత్వం కూడా కలుగుతుంది. టీవీ, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి. పుస్తక పఠనం అలవాటు పెంచుకుంటే ఎన్నో ప్రయోజనాలున్నాయి.
– సాయిప్రసన్న, ఎంబీబీఎస్ ఫస్టియర్, చించోలి బీ

అన్ని పుస్తకాలు ఉంచాం



విద్యార్థులు, యువత పుస్తక పఠనాభిరుచిని పెంచుకోవాలి. ఉద్యోగాల సాధనకు ప్రిపేర్ అవుతున్నవారికి జిల్లాకేంద్రంలోని ప్రధాన గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా మండల కేంద్రాల్లోనూ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాం.
– విజయశ్రీ, గ్రంథాలయాధికారి–గ్రేడ్ 2, నిర్మల్ జిల్లా కేంద్ర గ్రంథాలయం

రైతు సంక్షేమానికి కేంద్రం కృషి

- ఎంపీ గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

ఆదిలాబాద్‌టౌన్: రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మంగళవారం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల చేయగా, జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కిసాన్ సమ్మాన్ 17వ విడతలో భాగంగా దేశంలో 9కోట్ల 26లక్షల మంది రైతులకు రూ.20వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఒక్కో రైతుకు విడతల వారీగా రూ.2వేల చొప్పున రూ.6వేలు అందనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ వై.ప్రవీణ్‌కుమార్, శాస్త్రవేత్తలు రాంప్రసాద్, శ్రీధర్ చౌహాన్, రాజశేఖర్, జెడ్పీటీసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్‌వాసి మృతి

- నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలో ఘటన

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం నాలుగున్నర గంటల సమయంలో బ్రాహ్మణపల్లి బ్రిడ్జి వద్ద ఎన్‌హెచ్ 44 రోడ్డుపై ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బంకలవాడు బాలాజీ (50) అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రెండు రోజుల క్రితం నందిపేట మండలం కంఠం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో హైదరాబాద్ వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనూ హిందువులపై దాడులు

- ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు శంకర్, హరీశ్‌బాబు

ఆదిలాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ తరహాలోనే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు హయాంలోనూ హిందువులపై దాడులు కొనసాగుతున్నాయని ఆదిలాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఇటీవల మెదక్‌లో జరిగిన సంఘటనలో గాయపడ్డ బీజేపీ నాయకులను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం వారు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మెదక్‌లో ఆవులను అక్రమంగా తరలిస్తున్నారని పలువురు గోరక్షకులు పోలీసులకు సమాచారాన్ని అందించారన్నారు. అయితే పోలీసుల స్పందించకపోవడంతో గోరక్షకులు అక్రమ రవాణాను అడ్డుకోవడానికి యత్నించారని వెల్లడించారు.ఈ క్రమంలో గో సంరక్షణకు యత్నించిన వారిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ఈ విషయంలో డీజీపీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలన్నారు. ఘటనపై న్యాయ విచారణ జరిపించి బాధితులను ఆదుకోవడంతోపాటు, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'మా బాబును కాపాడండి ప్లీజ్..'



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన గూండ్ల నాగమణి వారం క్రితం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఉమ్మనీరు మింగడం, ఇతరత్రా అనారోగ్య సమస్యల కారణంగా శిశువుకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. దీంతో వారంరోజులుగా ఆస్పత్రిలోనే శిశువుకు చికిత్స చేయిస్తున్నారు. కడు నిరుపేద కుటుంబీకురాలైన గూండ్ల నాగమణి తన బాలుడి ఆరోగ్య పరిస్థితిపై కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. రెండు రోజులుగా బాబు పరిస్థితి విషమంగా ఉండగా నిర్మల్ వైద్యులు హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. చేతిలో చిల్లిగవ్వలేక ఈ నిరుపేద కుటుంబం తీవ్ర ఆవేదన చెందుతోంది. ఎవరైనా దాతలు సహకరించి తమ బాబును బతికించాలని వేడుకుంటున్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

బేల: మండలంలోని తోయగూడ గ్రామానికి చెందిన ఓ బాలిక(16) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి నిలకడగా ఉందని వైద్యసిబ్బంది తెలిపారు. కాగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

నానో యూరియాతో లాభాలు



నానోయూరియా ప్లస్‌ను లాంచ్ చేస్తున్న అధికారులు

కడెం: నానో యూరియాతో అనేక లాభాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ సీఈవోలతో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో నిర్వహించిన నానో యూరియా అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇఫ్కో నానో యూరియా కీటకాలు, తెగుళ్ల ఉధృతిని తగ్గిస్తుందని తెలిపారు. ఉత్పత్తి, ఆదాయాన్ని పెంచుతూ నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. నానో యూరియా నిల్వ చేయడం, రవాణా చేయడం సులభతరమని తెలిపారు. అంతకుముందు నానో యూరియా ప్లస్, నానో డీఏపీలను లాంచ్ చేశారు. అనంతరం ఇఫ్కో తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ కృపాకర్ మాట్లాడుతూ.. ఇఫ్కో ద్వారా రైతులకు సబ్సిడీపై డ్రోన్‌తో స్ప్రే చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో యాభై వేల ఎకరాల్లో డ్రోన్‌తో స్ప్రే చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీసీవో మోహన్, ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్లు బాలవికాస్, శ్రీధర్, పీఏసీఎస్ సీఈవోలు తదితరులున్నారు.

ఉద్యోగుల కృషితోనే ఆర్టీసీ ప్రగతి



అవార్డులు పొందిన ఉద్యోగులతో ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు

- సంస్థ రీజినల్ మేనేజర్ సోలోమన్
- 'ఉత్తమ' అవార్డుల ప్రదానం

ఆదిలాబాద్: ఉద్యోగుల నిరంతర కృషితోనే ఆర్టీసీ ప్రగతి సాధ్యమని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో రీజియన్ త్రైమాసిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉద్యోగులు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. సంస్థ అభివృద్ధి కోసం పాటుపడే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే వివిధ ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇదే ఉత్సాహంతో మిగతా వారు సైతం మెరుగైన సేవలు అందించేలా శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు ప్రణీత్, ప్రవీణ్ కుమార్, డిపో మేనేజర్లు కల్పన ప్రతిమారెడ్డి, విశ్వనాథ్, రవీంద్రనాథ్, పర్సనల్ ఆఫీసర్ జిబ్లా, కిరణ్, ఎంఎఫ్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

'సివిల్స్' ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: సివిల్ సర్వీసెస్ లాంగ్‌టర్మ్–2025 (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజాలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 19 నుంచి జూలై 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు జూలై 18 నుంచి ప్రారంభమై 2025 ఏప్రిల్ 18 వరకు కొనసాగుతాయని తెలిపారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనుండగా, అందులో 100 మందిని 2024 జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 50 మంది అభ్యర్థులను ఇంతకుముందు యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకోనున్నట్లు తెలిపారు. వారు సంబంధిత పత్రాలతో జూలై 3లోగా నేరుగా టీజీబీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్ 500059 చిరునామాలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు వసతి, భోజన, రవాణా కోసం నెలకు రూ.5వేలు, మరో రూ.5వేలు బుక్ ఫండ్ నిమిత్తం ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ సదుపాయం కూడా ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు 08732–221280 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గ్రూప్–2 ఉచిత గ్రాండ్ టెస్ట్‌ల కోసం..

టీజీపీఎస్సీ గ్రూప్–2 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి ఉచిత గ్రాండ్ టెస్ట్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజాలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రూప్–2 అభ్యర్థులకు నాలుగు ఉచిత గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి టెస్ట్‌లో భాగంగా జూలై 8న ఉదయం 10 గంటలకు పేపర్–1, మధ్యాహ్నం 1.30 గంటలకు పేపర్–2 ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 9న ఉదయం 10 గంటలకు పేపర్–3, మధ్యాహ్నం 1.30 గంటలకు పేపర్–4 ఉంటాయని తెలి పారు. ఇదే పద్ధతిన రెండో టెస్ట్ జూలై 15, 16 తేదీల్లో, మూడో టెస్టు జూలై 22, 23 తేదీల్లో, నాల్గో టెస్ట్ జూలై 30, 31 తేదీల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు www. tgbcstudycircle. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 19 నుంచి జూలై 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కు 08732–221280 నంబర్‌లో సంప్రదించవచ్చని కోరారు.

లక్ష్మణచాందలో తీవ్ర ఉద్రిక్తత

- విద్యార్థినిపై యువకుల అసభ్య ప్రవర్తన
- మందలించిన బాధితురాలి సోదరుడు
- ఈక్రమంలో ఇరువర్గాల పరస్పర దాడి
- వేధించినవారిని అరెస్ట్ చేయాలని డిమాండ్
- డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ



యువకులతో మాట్లాడుతున్న పోలీసులు

లక్ష్మణచాంద: ఇరువర్గాల పరస్పర దాడుల నేపథ్యంలో మంగళవారం రాత్రి మండల కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మామడ మండలం అనంతపేట్, పోతారం, పొన్కల్ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మామడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి పొన్కల్ నుంచి కాలినడకన పోతారం వెళ్తోంది. ఈ క్రమంలో లక్ష్మణచాందతోపాటు ఇతర గ్రామాలకు చెందిన ఓ వర్గానికి చెందిన ముగ్గురు యువకులు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో బాధిత విద్యార్థిని తన అన్నయ్యకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే అక్కడకు వచ్చిన విద్యార్థిని అన్నయ్య సదరు యువకులను మందలించాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. లక్ష్మణచాందకు చెందిన యువకులు మరికొందరు మిత్రులకు ఫోన్ చేసి అక్కడికి పిలిపించుకున్నారు. వారంతా పోతారానికి చెందిన ఇద్దరు యువకులను కొట్టి వారి సెల్‌ఫోన్లు, బైక్ కీ లాక్కుని మండల కేంద్రానికి వచ్చారు.

మండల కేంద్రంలో ఆందోళన..

తమ గ్రామానికి చెందిన విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించి, తమ యువకులను కొట్టి ఫోన్లు లాక్కున్నారని ఆగ్రహిస్తూ పోతారం, పొన్కల్, అనంతపేట్ గ్రామాల వందలాది మంది యువకులు బైక్‌లపై లక్ష్మణచాందకు సాయంత్రం 7గంటలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన యువకులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సై సుమలత సమాచారం మేరకు మామడ, సోన్, నిర్మల్ రూరల్, అర్బన్, సారంగాపూర్ ఎస్సైలు, సోన్, నిర్మల్ సీఐలు లక్ష్మణచాందకు చేరుకున్నారు. యువకులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. కాగా, తమ గ్రామస్తులను కొట్టిన యువకులను పట్టుకుని తగినచర్యలు తీసుకునేదాకా వెళ్లమని చెప్పగా ఆందోళన మరింత తీవ్రమైంది. విషయం తెలుసుకున్న నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి లక్ష్మణచాందకు వచ్చారు. అనంతపేట్, పొన్కల్, పోతారం గ్రామాల యువకులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించి, అనంతపేట్, పోతారం యువకులను కొట్టినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సదరు యువకుల నుంచి రక్త నమూనాలు సేకరించి గంజాయి తీసుకున్నట్లు తేలితే మరో కేసు నమోదు చేస్తామని చెప్పగా మూడు గ్రామాల ప్రజలు శాంతించారు.

గుట్కా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా గుట్కా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఇచ్చోడలోని భాగ్యనగర్‌కు చెందిన అవినాష్ అనే వ్యక్తి ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ నుంచి రూ.8వేల విలువ గల గుట్కా తీసుకెళ్తున్న సమయంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈయన జిల్లా కేంద్రంలోని అస్లమ్ ట్రేడర్స్ నుంచి గుట్కా కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో పోలీసు సిబ్బంది రమేశ్, క్రాంతి, నరేశ్, సుధాకర్ రెడ్డి, ప్రవీణ్ ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
OLD AGE HOME
■ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని చేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్ 8977639664 / 8977639665 [H-799891]

BUSINESS OFFER
■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5787]

■ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్ పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీతం+కమీషన్. సంప్ర: 7988242391 [H-189668]

WANTED
■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185219]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

క్లుప్తంగా

'నీట్ పరీక్ష రద్దు చేయాలి'

భైంసాటౌన్: నీట్ పరీక్షను రద్దు చేసి మరో సారి నిర్వహించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అంజాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం నిరసన తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలని, నీట్ పరీక్ష నిర్వణకు రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో హడావిడిగా ఫలితాలు విడుదల చేసి, లక్షలాది విద్యార్థులను అయోమయంలోకి నెట్టిందన్నారు. దీనికి కేంద్రప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

మామడ: మండలంలోని మామడ, పరిమండల్, కొరిటికల్, తాండ్ర విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగింపు, సబ్‌స్టేషన్ నిర్వహణ మరమ్మతు దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

ఖానాపూర్: పట్టణంలోని 33కేవీ విద్యుత్ లైన్‌తోపాటు సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏడీఈ కౌట్టి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సత్తన్‌పల్లి, పాత ఎల్లాపూర్, బీర్నంది, పెంబి, లింగాపూర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వర్షం కోసం పూజలు

కుంటాల: వర్షం కురవాలని మండలంలోని విఠాపూర్ హనుమాన్ ఆలయంలో మంగళవారం రైతులు, గ్రామస్తులు పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. అంబుగామ గ్రామానికి చెందిన శివాజీపటేల్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బంజారా సమ్మేళనం జయప్రదం చేయాలి

ఖానాపూర్: హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో గిరిజన విద్యుత్ మిడ్ కాంపౌండ్‌లో ఈనెల 20న నిర్వహించే జాతీయ గోర్ బంజారా సమ్మేళనం జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవింద్ పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో హర్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ డీలర్‌ను తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ రేషన్ డీలర్‌ను తొలగించాలని గ్రామస్తులు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో, తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. డీలర్ రాజేశ్వర్ గతేడాదిగా రేషన్ సరుకుల పంపిణీలో గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇందులో దుర్గి వెంకటేశ్, మల్లేశ్, రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని సాయినగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాలి రాజన్న, ఉపాధ్యక్షుడిగా బి.బాలాజీ, కార్యదర్శిగా కాశి గోపాల్, సహకార్యదర్శిగా కదం లక్ష్మణ్, కోశాధికారిగా ఎస్.శ్రీకాంత్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఎన్ఎస్‌యూఐ రాస్తారోకో

ముథోల్: నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు మండల కేంద్రం రాస్తారోకో నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ అసెంబ్లీ అధ్యక్షుడు భూషణ్‌ఉమ్మే మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జీతో విచారణ జరిపించాలన్నారు. గంగాప్రసాద్, దశరథ్, గౌతమ్, విష్ణు, శశికాంత్, అమూల్, జశ్వంత్ పాల్గొన్నారు.

చెరువు గుంతలు ప్రమాదకరం

- మొరం తరలింపుతో ఏర్పడుతున్న గుంతలు
- పట్టించుకోని అధికారులు



కిష్టాపూర్‌లో చెరువు గుంత పడి మరణించిన బాలుడు (ఫైల్)



లోకేశ్వరంలో చెరువులో మొరం తీసిన గుంత

లోకేశ్వరం: జిల్లాలో చెరువుల్లో మొరం తవ్వకాల దందా జోరుగా సాగుతోంది. పొక్లయిన్‌లు, జేసీబీల ద్వారా తవ్వకాల చేస్తుండడంతో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామాల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ దందా యజమానులకు మూడు పువ్వులు ఆరుకాయలు అన్న చందంగా వ్యాపారం సాగుతోంది. మొరం ట్రాక్టర్ ట్రిప్పు రూ.500 నుంచి రూ.600 వరకు వసూళ్లు చేస్తున్నారు. చెరువుల్లో అక్రమ మొరం తవ్వకాల కోసం తీసిన గుంతలో పడి ప్రజలు, పశువులు ప్రాణాలు పోతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

గుంతలో పడి ప్రాణాలు హరి..

- మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోని రాజుల చెరువులోకి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు గుంతలో పడి చనిపోయాడు. మరో విద్యార్థిని సబ్‌స్టేషన్ సిబ్బంది గంగాకిషన్ ప్రాణాలతో కాపాడాడు.
- 2006లో హత్‌గాం సమీపంలోని ఓ చెరువులో బట్టలు ఉతికేందుకు తన కుమారుడు ఆయన స్నేహితుడు శుద్దోదన్‌తో మేస్త్రి లక్ష్మి కలసి వెళ్లింది. దుస్తులు ఉతుకుతుండగా శుద్దోదన్ జేసీబీ తీసిన గుంతలో పడి చనిపోయాడు. కాపాడేందుకు వెళ్లిన లక్ష్మి మృతిచెందింది.
- 2013లో ముథోల్ మండలంలోని గన్నోర గ్రామానికి చెందిన మహిళ తన కూతురితో కలసి తల్లిగారి ఊరైన వాస్తాపూర్‌కు వచ్చి సమీపంలోని ఓ చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. తల్లీబిడ్డలు ఇద్దరు జేసీబీ తీసిన గుంతలో పడి మృత్యువాత పడ్డారు.
- 2022లో ధర్మోర గ్రామానికి చెందిన మత్స్యకారుడు జంబుగ లస్మన్.. చెరువులో చేపల వేటకు వెళ్లి జేసీబీ గుంతలో ప్రమాదశాత్తు పడి మృతిచెందాడు.

మొరం తవ్వకాలను నిలిపివేయాలి



చెరువుల్లో మొరం తవ్వకాలు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. మొరం తవ్వకాల గుంతలో పడి ప్రజలు చనిపోతున్నారు. అధికారుల వెంటనే స్పందించి తవ్వకాలను నిలిపివేయాలి.

– రాజేశ్వర్, వట్టోలి

చర్యలు తీసుకుంటాం

చెరువులో మొరం తవ్వకాలు చేపట్టాలంటే ముందుగా నీటి పారుదల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా అక్రమంగా తవ్వకాలు చేపడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి తవ్వకాలను నిలిపివేసేలా చర్యలు తీసుకుంటాం.

– మోతీరాం, తహసీల్దార్

వీధి విక్రేతలకు అవగాహన తప్పనిసరి

నిర్మల్‌ఖిల్లా: ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకునే వీధి విక్రేతలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పర్కిపండ్ల పేర్కొన్నారు. గురువారం తన బృందంతో కలిసి జిల్లాకేంద్రంలోని పలుప్రాంతాల్లో వీధివిక్రేతల సర్వే చేపట్టారు. జిల్లా కేంద్రంలో రోడ్డుపక్కన వ్యాపారాలు చేసుకుని అనేకమంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వీరికి ప్రొటెక్షన్ ఆఫ్ లైవ్లీహుడ్ ప్రమోషన్ ఆఫ్ స్ట్రీట్ వెండింగ్‌ను అనుసరించి స్థానిక సంస్థల అధికారులు టౌన్ వెండింగ్ కమిటీ ఏర్పాటు చేసి చట్టాన్ని అమలు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీల పరిధిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని కొందరు దుకాణాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరు చిరువ్యాపారుల నుంచి నెలనెలా కిరాయి వసూలు చేయడం తమ సంఘం దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. పట్టణాల్లో టౌన్ వెండింగ్ కమిటీ (టీవీసీ)లు, వ్యాపారులకు ప్రత్యేక వెండింగ్‌జోన్లు ఏర్పాటు చేసి ప్రత్యేక ఫీజు వసూలు చేయడం, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం, పరిశుభ్రత మీద అవగాహన, శిక్షణ కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులదేని తెలిపారు. కానీ, ఇప్పటివరకు ఈ కమిటీలను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇందులో సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలకు భాగస్వామ్యం కల్పించాల్సి ఉన్నా, ప్రస్తుతం ట్రాఫిక్ అంతరాయం కొనసాగుతోందని వివరించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు తమ అధికారాలను ఉపయోగించి ఫుట్‌పాత్ ఆక్రమణదారులను ఖాళీ చేయించి నగర శోభను కాపాడాలని సూచించారు. ఈ అంశాలపై త్వరలోనే తమ యూనియన్ ద్వారా నివేదిక తయారుచేసి మున్సిపల్ అధికారులకు అందించనున్నట్లు తెలిపారు. వీరి వెంట సంఘం జిల్లా సమన్వయకర్త కొమ్ము గీత తదితరులున్నారు.

సంక్షిప్తంగా

మహిళల భద్రతే లక్ష్యం

సారంగపూర్: మహిళలకు భద్రత కల్పించడమే షీటీమ్ లక్ష్యమని షీటీమ్ పీసీ రాధిక అన్నారు. మండలంలోని ధని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, రక్షణ, సైబర్ నేరాలు, తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నారు.

ఈత చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడెం: మండలంలోని మాసాయిపేట్ శివారులో ఈత చెట్లు నరికిన గ్రామానికి చెందిన మామిడిపెల్లి రామగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సదర్‌మట్ కాలువ సమీపంలో ఈత చెట్లను బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగించారని పేర్కొన్నారు. వారి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గీత కార్మిక సంఘ నాయకులు సత్యంగౌడ్, గంగాధర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దేవగౌడ్, తదితరులు ఉన్నారు.

పాఠశాలకు టీవీ అందజేత

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు రూ.14 వేల విలువ గల ఆండ్రాయిట్ టీవీని అందజేశారు. పేద విద్యార్థులకు డిజిటల్ తరగతుల కోసం టీవీని అందజేసినట్లు లక్ష్మీనర్సయ్య, రవికుమార్, రాజేశ్, నవీన్‌కుమార్, భూమేశ్ తెలిపారు. హెచ్‌ఎం కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రణయశీల, గంగారాం, శ్రీనివాస్, ఎఎంసీ చైర్మన్ చంద్రకళ ఉన్నారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి

కడెం: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని స్వర్ణకార సంఘం మండల అధ్యక్షుడు ఇనగుర్తి సదానందం డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లో నిరాహార దీక్ష చేస్తున్న కొండాజీ నరసింహాచారికి సంఘీభావంగా మంగళవారం మండల కేంద్రంలో స్వర్ణకారులు దీక్ష చేపట్టారు. బ్రహ్మాచారి ఉన్నారు.

పేదల కోసం కేంద్ర పథకాలు

లోకేశ్వరం: పేదల కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం బాల వికాసనీటి శుద్ధజల ప్లాంట్, మండల కేంద్రంలో లోకేశ్వరం మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ అధ్వర్యంలో పసుపు ఉడకబెట్టే మిషన్‌ను ప్రారంభించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లను అందజేశారు. బాలవికాస ప్రాజెక్టు మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ కోఆర్డినేటర్ ప్రసన్‌రెడ్డి, మహిళా అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మురళీ, నిర్మల్ జిల్లా మహిళా అభివృద్ధి ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్వర్, లోకేశ్వరం మహిళ అభివృద్ధి సంస్థ సంఘం అధ్యక్షురాలు నాగమణి, మాజీ సర్పంచ్ శైలజ, ఎంపీటీసీ సభ్యుడు జయసాగర్‌రావు, నాయకులు శ్రీధర్, గంగారెడ్డి, గంజాల గంగాధర్, భాస్కర్, గణేశ్, చిన్నారావు, పోతన్న ఉన్నారు.



రైతులకు టార్పాలిన్లు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నిర్మల్‌రూరల్: మండలంలోని కొండాపూర్ శివారులోని దామన్నకుంట శిఖంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సంతోష్ సిబ్బందితో వెళ్లి మంగళవారం కూల్చివేశారు. గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు క్రీడా మైదానం కోసం చదును చేసి, క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. కొందరు క్రీడా పరికరాలను మాయం చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటుచేసిన క్రీడా పరికరాలను తొలగించి, పునాదులు తవ్వి, పిల్లర్లు నిర్మించి షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తుల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే సిబ్బందితో సర్వే చేయించారు. శిఖం భూమిలో సర్వేనంబర్ 321లో అక్రమ నిర్మాణాలు చేసిన మాట వాస్తవమేనని నిర్ధారించి కూల్చివేశారు. అనంతరం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



కూల్చివేస్తున్న అధికారులు

భగీరథ సర్వే వేగవంతం చేయాలి

మామడ: మండలంలో మిషన్‌భగీరథ సర్వేను వేగవంతం చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మామడ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ సర్వేలో ఇంటింటా సర్వే చేసి వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ఇంటిపన్నుల వసూళ్లు చేయాలని, వర్షాకాలంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డీఎల్‌పీవో రమేశ్, సూపరింటెండెంట్ లింబాద్రి పాల్గొన్నారు.

అవగాహన లేక క్యూలోనే..!



ఓపీ కౌంటర్ వద్ద క్యూలో నిల్చున్న రోగులు

భైంసాటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షల కోసం వచ్చే రోగులు ఓపీ టోకెన్ కోసం గంటల తరబడి క్యూలో నిల్చుంటారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో మరింత జాప్యం నెలకొంటుంది. వృద్ధులు, గర్భిణులు, నీరసంగా ఉన్నవారు క్యూలో నిల్చోలేక ఇబ్బందులు పడతారు. దీంతో ఓపీ కౌంటర్ వద్ద ఇలాంటి ఇబ్బందులకు చెక్ పెట్టేందుకుగాను నేషనల్ హెల్త్ అథారిటీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా అభా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. రోగులు క్యూలో నిలబడకుండా క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌లో స్కాన్ చేసుకుంటే టోకెన్ నంబర్ వస్తుంది. ఆ టోకెన్‌ను రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద చూపిస్తే వెంటనే ఓపీ టికెట్ ఇస్తారు. ఈ మేరకు యాప్‌పై అవగాహన కోసం భైంసాలోని ఏరియాస్పత్రి ఆవరణలో ఓపీ కౌంటర్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే చాలామంది రోగులకు దీనిపై అవగాహన లేకపోవడంతో గంటల తరబడి క్యూలోనే నిల్చుంటున్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది రోగులకు యాప్‌పై అవగాహన కల్పిస్తే కొంతమేర క్యూ తగ్గే అవకాశముంది. తద్వారా నిరక్షరాస్యులైన, స్మార్ట్ ఫోన్ లేనివారు క్యూలో రద్దీ లేకుండా ఉండి ఓపీ టికెట్ సులువుగా పొందవచ్చు.



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన ఫ్లెక్సీ

టేకు సాగుతో ఆదాయం బాగు

- రైతులు దరఖాస్తు చేస్తే ఉచితంగా మొక్కల పంపిణీ
- ఈజీఎస్, పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీల ఏర్పాటు



తానూరు నర్సరీలో పంపిణీ సిద్ధంగా ఉన్న టేకు మొక్కలు

తానూరు: టేకు మొక్కలు పెంచుకుంటే మంచి ఆదాయం సమకూరుతుందని వీటిని ఇంటి ఆవరణలే కాకుండా ఖాళీ స్థలాల్లో, పొలం గట్లపై పెంచుకోవచ్చని అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. గతంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన వన నర్సరీల ద్వారా మాత్రమే టేకు మొక్కలను రైతులకు అందుబాటులో ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం హరితహారంలో భాగంగా టేకు మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తోంది. దీనికితోడు సన్న, చిన్నకారు రైతులకు కందకాలు తీయడానికి ఈజీఎస్ ద్వారా కూలీ డబ్బులు చెల్లిస్తోంది. వీటి సంరక్షణకుగాను మెయింటనెన్స్ ఇస్తోంది.

యాజమాన్య పద్ధతులు

- మొక్క మొక్కకు సుమారు 2 మీటర్ల దూరం ఉండేలా నాటుకోవాలి.
- తేమ ఎక్కువగా ఉండే భూముల్లో నాటుకుంటే మంచిది.
- మొక్కకు ప్రతీరోజు రెండు సార్లు నీరుపెట్టాలి. ఎంత నీటిని అందిస్తే మొక్క అంత బలంగా పెరుగుతోంది.
- మొక్క నాటిన ప్రదేశంలో నీళ్లు నిలిచి ఉండడానికి చుట్టూ గుంత తవ్వాలి.
- సేంద్రియ ఎరువులు మాత్రమే వాడాలి.
- ఎండిపోయిన పశువుల పేడ, వానపాములు వేస్తే మొక్క తొందరగా పెరుగుతుంది.
- పెరిగిన చెట్టు 20 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్యలో కాండం అరమీటర్ చుట్టూ కొలత వస్తే కోతకు వచ్చినట్లు గుర్తించాలి.
- 30 ఏళ్ల టేకు చెట్టు 8 నుంచి 10 ఘనపు ఫీట్ల వరకు పెరుగుతుంది.
- చెట్టు పెరుగుతున్న దశలో చీడపీడలు పోకితే ఉద్యానవన అధికారులను సంప్రదించాలి.

ఆదాయం ఎక్కువ..

ఆర ఎకరంలో 4 వందల మొక్కల వరకు నాటుకోవచ్చు. నాటిన 20 నుంచి 30 సంవత్సరాల్లో చెట్లు కోతకు వస్తాయి. బాగా పెరిగిన ఒక్కో చెట్టు 8 నుంచి 10 ఘనపు ఫీట్ల పొడవు పెరుగుతోంది. మార్కెట్‌లో ఒక్కో ఘనపు ఫీట్‌కు రూ.2 వేల విలువ గల కలప వస్తుంది.

కోతకు అనుమతి తప్పనిసరి

చెట్టు నరికే సమయం వచ్చినట్లు గుర్తించగానే డివిజనల్, అటవీశాఖ అధికాకారి కార్యాలయంలో సంప్రదిస్తే అనుమతి పత్రం ఇస్తారు. మొక్కలు నాటిన భూమి సర్వే నంబర్ నమోదు చేయాలి. తర్వాత వీఆర్వో ధ్రువీకరించి తహసీల్దార్‌కు అందజేస్తే పరిశీలించి నరకడానికి పత్రంలో రాసిన సర్వే నంబర్ సరైనదేనా అని తెలుసుకుంటారు. అనంతరం తహసీల్దార్ ధ్రువీకరించి ఇచ్చిన పత్రాన్ని డివిజనల్ అటవీశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలి. వారు చెట్లను నరికి వేయడానికి అనుమతి ఇస్తారు.

గ్రామస్తులకు అవగాహన

గ్రామాల్లో ఈజీఎస్ అధికారులు 10వ విడతలో భాగంగా నీటి వసతి ఉన్న రైతులు మొక్కలు నాటాలని గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. పొలాల్లో గట్లపై టేకు చేట్లు నాటాలని అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం, పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీల ద్వారా టేకు మొక్కలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో పంటలు రాని గుట్ట ప్రాంతంలో ఉన్న భూముల్లో మొక్కలు నాటుకునేలా చూడాలని వివరిస్తున్నారు.



పంచాయతీ అధికారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దరఖాస్తులు చేసుకుంటే ఉచితంగా అందిస్తాం



నర్సరీ మొక్కల కోసం రైతులు పంచాయతీ లేదా ఈజీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటే ఉచితంగా టేకు మొక్కలు అందిస్తాం. మొక్కలు నాటిన రైతులకు మెయింటెనెన్స్ డబ్బులు అందిస్తాం.

– గంగాధర్, ఈజీఎస్ ఏపీవో

తాత్కాలిక డ్రైనేజీ పనులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ బొడ్డానికుంటలోకి మురుగునీరు వెళ్లకుండా మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో మంగళవారం తాత్కాలిక డ్రైనేజీ పనులు చేపట్టారు. డ్రైనేజీ నీటితో కుంటలో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైస్ చైర్మన్ కావలి సంతోశ్, నాయకుడు పరిమి సురేశ్, తదితరులున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



1997-98 పూర్వ విద్యార్థులు

కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన 1997-98, 2006- 07, 2011-12, పూర్వ విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలిసిన వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మిత్రులంతా ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమెరువేసుకున్నారు.

కూచిపూడి నృత్యంలో ప్రతిభ

నిర్మల్‌ఖిల్లా: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో కూచిపూడి నృత్యంలో జిల్లాకేంద్రానికి చెందిన డాక్టర్ కిరణ్– కృష్ణవేణి కుమార్తె దేవర్షిని ప్రతిభ కనబర్చింది. పెళ్లిపుస్తకం సినిమా ఫేమ్, నటి దివ్యవాణి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞశర్మ చేతుల మీదుగా ఉత్తమ ప్రదర్శన ప్రశంసపత్రం, జ్ఞాపిక స్వీకరించారు. అదేవిధంగా 'జయహో తెలంగాణ'కార్యక్రమంలో సారంగాపూర్ మండలం బీరవెల్లికి చెందిన అక్కాచెల్లెళ్లు గణనరెడ్డి, సహజరెడ్డి చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన పలువురిని అలరించింది.



పురస్కారం స్వీకరిస్తున్న దేవర్షిని

WALK - IN INTERVIEW



నిర్మల్ కేంద్రంగా ఉంటూ.. నిర్మల్ పట్టణములో పరిసర ప్రాంతాలలో ప్రకటనలు సేకరించుటకు చురుకైన, వాక్చాతుర్యం గల, ఎదుటి వారిని ఒప్పించి, మెప్పించే నేర్పుగల Advt. Representatives / ఫీల్డ్ స్టాఫ్ కావలెను.
మీ ప్రాంతంలోనే ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగం చేయాలనుకుంటే సంప్రదించండి..
విద్యార్హత : 10వ తరగతి లేదా ఆపైన
వయస్సు : 18 సం॥లు ఆపైన
పత్రికా రంగంలో అనుభవం గల వారు మరియు కొత్తవారు కూడా సంప్రదించవచ్చు.
ఇంటర్వ్యూ తేది : 19-06-2024 బుధవారం రోజున ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రము 4 గం॥ వరకు.
ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్స్‌తో ఈ దిగువ చిరునామాలో సంప్రదించగలరు.
సాక్షి
రేపటికి ముందడుగు
సాక్షి సిటీ ఆఫీస్, మొదటి అంతస్తు, కవితా కాంప్లేక్స్, బస్టాండ్ రోడ్, నిజామాబాద్. సెల్ నెం. 9912220764

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899